

19న పాడేరులో జాబ్‌మేళా

ప్రజాశక్తి- పాడేరు : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ,జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో పాడేరు జిఎంఆర్ పాలిటెక్నిక్ ప్రాంగణంలో, ఈనెల 19న ఉదయం 10గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.రోహిణి సోమవారం ప్రకటనలో తెలిపారు. మినీ జాబ్ మేళాలో రుద్ర కోపరేటివ్, ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్స్, ఎయిర్‌టెల్, పేమెంట్‌బ్యాంకు, ప్రెమెంట్స్ బాంక్ నాలుగు కంపెనీలు పాల్గొంటాయన్నారు. జిల్లాలోని 18-30ఏళ్ల వయస్సు కలిగి, టెన్త్, ఇంటర్, ఆపై విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువత పాన్ కార్డు, ఆధార్ కార్డు, సరిఫికేట్స్ జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు జీతం రూ.పదివేలు నుంచి రూ.15వేలు వరకు జీతం ఉంటుందన్నారు. ఈ సదవకా శాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 6302 636 174, 9398338105 సంప్రదించాలని నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి రోహిణి సూచించారు.

ఉత్సాహంగా సిపిఎం జిల్లా మహాసభ

- ★ రంపచోడవరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- ★ పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్
- ★ ఆలోచింపజేసిన నాయకుల ప్రసంగాలు



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, చిత్రంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, సురేంద్ర, జిల్లా కార్యదర్శి కిరణ్, జిల్లా నాయకులు

ప్రజాశక్తి-రంపచోడవరం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి విలేకర్లు

సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రథమ మహాసభ సోమవారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. దీనికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, మంతెన సీతారాం, కిల్లో సురేంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహాసభను పురస్కరించుకొని రంపచోడవరం సిపిఎం కార్యాలయం నుండి ఆర్టీసీ కాంప్లెక్స్, అంబేద్కర్ సెంటర్ మీదుగా రంప రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రసంగించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌ను తుంగలో తొక్కి ఆదివాసీ ప్రాంతాన్ని కార్పొరేట్ సంస్థల దోపిడీకి కట్టబెట్టే కుట్ర చేస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆదివాసీలు తమ ఉనికిని, హక్కులను కాపాడుకోవడానికి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంత ప్రజల భూములు పోయాయని, వరదలొచ్చి గ్రామాలకు గ్రామాలు మునిగిపోతున్నాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు వచ్చే నిధులు ఎన్నికోట్లు తినేయాలనే ఆరోచన తప్ప పోలవరంలో మునిగిపోతున్న నిర్వాసితుల సమస్యలు ముఖ్యమంత్రికి, ప్రభుత్వ పెద్దలకు పట్టడం లేదని విమర్శించారు. పోలవరానికి రూ.12వేల కోట్లు ఇచ్చామని గొప్పలుపోతున్న ప్రభుత్వం, అందులో నిర్వాసితులకు ఇచ్చింది ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారాన్ని చెల్లించిన తర్వాతే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టాలని, పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ప్రాణం ఉన్నంత వరకు పోరాటం : వెంకటేశ్వర్లు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులు, నిరుపేదలు, సన్న చిన్నకారు రైతులు, చిరువ్యాపారుల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎర్రజెండా ప్రాణం ఉన్నంతవరకు పోరాడుతుందని స్పష్టం చేశారు.

జిఒ 3ని పునరుద్ధరించాలి : సీతారాం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అరకు సభలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు జిఒ నెంబర్ 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే దానికి ప్రత్యామ్నాయంగా జీవో నెంబర్ 3లోని అంశాలను పరిగణనలోనికి తీసుకుని మరో జీవోను విడుదల చేయాలని కోరారు. గిరిజన ప్రాంతంలో ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలన్నారు.

గిరిజన చట్టాలు పటిష్ట అమలుకు పోరాటం : సురేంద్ర

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో 1/70, అటవీ హక్కుల చట్టాలు, ఇతర గిరిజన చట్టాలు ప్రతిష్టంగా అమలుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆరు నెలల టిడిపి కూటమి ప్రభుత్వం వల్ల గిరిజనులకు ఒరిగింది ఏమి లేదన్నారు. పోడు భూములు సాగు చేస్తున్న జీడీ రైతులకు గిట్టుబాటు దర ఇవ్వాలన్నారు. టూరిజం పేరుతో గిరిజన సంస్కృతిని దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రంపచోడవరం ప్రత్యేక జిల్లాతోనే అభివృద్ధి సాధ్యం : లోతా

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు మాట్లాడుతూ వరదలకు ఏజెన్సీలోని పలువురు కొట్టుకుపోతే చాలా బాధించి పోయామని రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు సోషల్ మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేశారని, కాని ఈ ప్రాంతంలో వంతెనలు, రోడ్లు నిర్మించడానికి కనీసం ప్రతిపాదనలు కూడా చేయలేదని విమర్శించారు. రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

అన్ని వర్గాల సమస్యలపై పోరాటాలు : కిరణ్

సభకు అధ్యక్షత వహించిన పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్య, పోడు భూములకు పట్టాల కోసం, ఉపాధి హామీ కూలీ రేట్లు పెంచాలని, స్కీమ్ వర్కర్లు ఇలా అన్ని వర్గాల సమస్యలపై సిపిఎం అనేక పోరాటాలు నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మడపాటి నాగేశ్వరరావు, ఎం.వాణిశ్రీ, కె.సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు పి.వెంకట్, ఎస్.సురేష్, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, పార్టీ నాయకులు వై.శ్రీనివాస్, పులి సంతోష్‌కుమార్, బి.బొర్రయ్య, కె.సూరిబాబు, కె.అర్జున్‌దొర, జిల్లా నలుమూలల నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

వెలుగు యానిమేటర్లు సమస్యలపై వినతి

బహిరంగ సభలో వెలుగు యానిమేటర్లు తమ సమస్యలపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. దీనికి స్పందించిన శ్రీనివాసరావు యానిమేటర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతామని, ప్రభుత్వం స్పందించకుంటే యానిమేటర్ల తరఫున సిపిఎం పోరాడుతుందని చెప్పారు.

ప్రతినిధుల సభ ప్రారంభం

మారేడుమిల్లి : బహిరంగ సభ అనంతరం రంపచోడవరంలోని ఆర్‌పి కళ్యాణ మండపంలో సీతారాం ఏచూరి ప్రాంగణం, పూనెం సత్యనారాయణ నగర్‌లో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. దీనికి పార్టీ నాయకులు లోతా రామారావు, సీసం సురేష్, కాకా అర్జున్‌దొర, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి అధ్యక్షత వర్గంగా వ్యవహరించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్ సంతాప తీర్మానం ప్రవేశ పెట్టారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు. పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, జిఓ నెంబర్ 3ను పునరుద్ధరించాలని, గిరిజన ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.



సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న వెలుగు యానిమేటర్లు



మహాసభలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న ప్రతినిధులు



పోలవరం నిర్వాసితుల సమస్యలపై తీర్మానం ప్రవేశ పెడుతున్న కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య

కాఫీ రైతులకు జిసిసి అండ

- సంస్థ రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



కాఫీ తోటలో పండ్లను పరిశీలిస్తున్న జిసిసి చైర్మన్ శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి- అరకులోయ : కాఫీ రైతులకు ప్రభుత్వపరంగా జిసిసి అండగా ఉంటుందని సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ భరోసానిచ్చారు. రైతులు తాము పండించిన కాఫీ గింజలు, పండ్లను జిసిసికి విక్రయించి తగు ధర పొందాలని, దళారులను ఆశ్రయించి మోసానికి, నష్టానికి గురికావద్దని సూచించారు. సోమవారం అరకువేలి మండలం సుంకరమెట్ట,బిసుపురం గ్రామాలలో పర్యటించి, కాఫీ తోటలను శ్రావణ్ కుమార్ పరిశీలించారు. కాఫీ తోటలోని కాఫీ పండ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

అనంతరం మాట్లాడుతూ,కాఫీ సీజన్ దగ్గర పడిన దృష్ట్యా రైతులందరు కాఫీని జీసీసీకి విక్రయించేలా చూడాలని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కాఫీ రైతులందరు జీసీసీ కి విక్రయించాలన్నారు. జిసిసి ఆధ్వర్యంలో కాఫీకి మంచి రేటు ఇస్తామని,దళారుల చేతిలో మోసపోకూడదని రైతులకు సూచించారు. కాఫీ రైతులకు జిసిసి ద్వారా రుణాలను ఇస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, రాష్ట్ర ఎస్‌టి సెల్ ఆర్గనైజషన్ సెక్రటరీ సాగర సుబ్బారావు, బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, అండిభ సర్పంచ్ తామర్ల సత్యనారాయణ, శోభకోట సర్పంచ్ శశిభూషణం నాయుడు, క్లస్టర్ ఇంచార్జి త్రినాధ్, అరకు అసెంబ్లీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దన్నుయిక రమేష్ పాల్గొన్నారు.

విద్యా సమస్యలను పరిష్కరించాలి


- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ర్యాలీ, మండల పరిషత్ ముట్టడి
- అధికారులు, నేతలకు వినతిపత్రాలు అందజేత



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన మండల పరిషత్ ముందు బైఠాయించి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -అనంతగిరి : దీర్ఘకాలికంగా ఉన్న విద్యా, పాఠశాల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ, మండల పరిషత్ ముట్టడి ఆందోళన చేపట్టారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైన ర్యాలీ, మూడు రోడ్ల కూడలి మీదుగా మండల పరిషత్ వరకు చేరింది. అక్కడ గంటసేపు బైఠాయించి, నినాదాలు చేస్తూ, కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక ఎంపిపి శెట్టి నీలవేణి, జెడ్‌పిటిసి దీసరి. గంగరాజు, ఎంపిడిఒ ఎవివి.కుమార్‌లకు అందజేశారు. విద్యార్థుల ఆందోళనకు స్థానిక జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, టోకూరు సిపిఎం సర్పంచ్ కిల్లో మొస్య మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చాలీచాలని పాఠశాల, హాస్టల్ గదులలో విద్య బోధనలు సాగించడమే కాకుండా, మెనూ అమలులో నిర్లక్ష్యం వల్ల నాసిరకమైన భోజనాలతో విద్యార్థులు ఆరోగ్యం పాడౌతోందన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో హాస్టల్ వసతి భవనం లేకపోవడంతో విద్యార్థులు కొంతమంది అద్దెఇళ్లల్లో ఉంటూ చదువుకునేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం కళాశాల హాస్టల్ వసతి భవనం నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.జీవన్‌కృష్ణ కె.కార్తీక్‌కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. ప్రతి పాఠశాలకు రన్నింగ్ వాటర్, మరుగుదొడ్లు వసతిగదులు కల్పించాలని డిమాండ్ చేశారు.కాస్మటిక్ మెనూ చార్జీలు పెంచాలని, గురుకుల పాఠశాలల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, వారు విధుల్లో చేరేలా చర్యలు చేపట్టాలని కోరారు.



జెడ్‌పిటిసి, ఎంపిపి, ఎంపిడిఒకు వినతిపత్రాలు ఇస్తున్న విద్యార్థి సంఘం నేతలు

వన్‌ధన్ వికాస్ కేంద్రాలకు నిధులు


- ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్



సమీక్షలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి -పాడేరు : వన్‌ధన్ వికాస కేంద్రాల(విడివికె)ల బలోపేతానికి అందుబాటులో ఉన్న రూ.1కోటి 52 లక్షల నిధులు వినియోగించాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ వెల్లడించారు. సోమవారం ఐటిడిఏ వీడియో కాన్ఫరెన్స్ హాలులో వెలుగు అధికారులు, ఎపిఎంలతో వన్ ధన్ వికాస కేంద్రాల నిర్వహణ, వన్ ధన్ వికాస కేంద్రాల సభ్యులకు అందించిన శిక్షణలు, ఉత్పత్తులు, భవన నిర్మాణాలు, మౌలిక యంత్ర పరికరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విడివికెలు బలోపేతానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఐటిడిఏ పరిధిలో 106 విడివికెలులో 39 విడివికేల వద్ద నిధులు ఉన్నాయన్నారు. విడివికె సభ్యులకు శిక్షణలకు ఖర్చు చేయగా మిగిలిన నిధులను మూల ధన పెట్టుబడిగా వినియోగించాలని సూచించారు. అడుగులపుట్టు విడివికెలో రూ. 2.85 లక్షలు, రంగలోయ రూ.2.85 లక్షలు, గుత్తులపుట్టులో రూ.3.75లక్షలు, వంట్ల మామిడి లో రూ.2.81 లక్షలు, చినలబుడు రూ.3.35 లక్షలు, బీమవరం విడివికేలో రూ.4.51 లక్షల నిధులు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు శిక్షణకు, యంత్ర పరికరాలకు ఖర్చు చేసిన నిధులకు యుటిలైజేషన్ సర్టిఫికేట్లు సమర్పించాలని సూచించారు.. 11 మండలాల్లో ఉన్న ఇఎంఆర్ఎస్ పాఠశాలలకు విడివికే ఉత్పత్తులను సరఫరా చేయాలన్నారు. సమావేశంలో ఐటిడిఎ ఎపిఒలు విఎస్. ప్రభాకర రావు, ఎం.వేంకటేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ మురళి,11 మండలాల ఏరియా కోఆర్డినేటర్లు, వెలుగు ఎపిఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపిపి, ఎంపిడిఒ

ప్రజాశక్తి- అనంతగిరి : అనంతగిరి బాలికల పాఠశాల 1ను సోమవారం ఎంపిపి శెట్టి నీలవేణి, ఎంపిడిఒ ఎవివి.కుమార్ సందరిశంచారు. పాఠశాల పరిశుభ్రత, భోజన వసతి సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గదుల్లో సరైన విద్యుత్ సౌకర్యం లేదని, ఒక్కొక్క గదిలో 30 నుండి 50 మంది వరకు పడుకుంటున్నామని, డార్మెటరీలో సౌకర్యాలు లేవని విద్యార్థులు విన్నవించారు. ఫిజిక్స్ టీచర్ లేకపోవడంతో బోధన సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఎంపిపి, ఎంపిడిఒ భరోసానిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విమల కుమారి పాల్గొన్నారు

షేక్ సాబ్జికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి- దుంబ్రిగుడ:స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో షేక్ సాబ్జీ ప్రథమ వర్ధంతిని యుటిఎఫ్ మండల మండల అధ్యక్షుడు ఎస్ బాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. షేక్‌సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కన్నయ్య మాట్లాడుతూ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారన్నారు.ప్రాథమిక పాఠశాలలో సామాన్య ఉపాధ్యాయునిగా విధుల్లోచేరి, అంచెలంచెలుగా ఎదుగుతూ యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా 2021లో జరిగిన ఉభయగోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికై సంఘం పిలుపుమేరకు అప్రెంటిస్ విధానంపై, నోషనల్ ఇంక్రిమెంట్ సాధించడం, పాత పెన్షన్ విధానం సాధనకు, జిఒ 117రద్దుకు రాష్ట్రంలో నలుమూలలా జీపు జాతా, బైకు జాతా, బస్సు యాత్రలో చేపట్టి, మండలిలో ఉపాధ్యాయ గళం వినిపించారన్నారు. చివరి వరకు ఉద్యమ స్ఫూర్తితో సంఘ కార్యక్రమంలో పాల్గొని, విశేష సేవలు అందించి చిరస్మరణీయంగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం.మోహన్, మేఘ నాథ్, జాకీరురాజ్ కుమార్, శ్రావణ్, దుక్కు పాల్గొన్నారు.

మారుమూల పాఠశాలల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ కృష్ణమూర్తి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు :మండలంలోని అతి మారుమూల ప్రాంతమైన లబ్బూరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోనీ ప్రాథమిక పాఠశాలలను సోమవారం మండల విద్యాశాఖాధికారి కూడా కృష్ణమూర్తి పర్యటించారు. అత్యంత మారుమూల గ్రామాలైన లబడ పుట్టు, కుతుడ, అలబీరు, కెందుపుట్టు, కడుతుల ప్రాథమిక పాఠశాలలను కాంప్లెక్స్ సిఆర్‌సిలతో తనిఖీ చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమయపాలనపై గ్రామ ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్య బోధన సామర్థ్యతపై ఆరా తీశారు. తక్కువ సామర్థ్యత కలిగిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజు బడికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారుఅలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు.పశువుల పాకను తలపించే షెడ్డులో పాఠశాల నిర్వహిస్తున్నారని లబడపుట్టులో విద్యార్థుల తల్లి దండ్రులు ఎంఇఒకు విన్నవించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు, ఫార్మెట్ అసెస్‌మెంట్ మార్కుల అప్‌లోడ్, రైటవుట్ టీచింగ్ లెవెల్ పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. సిఆర్‌పిలు కిముడు హరి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

17, 18 తేదీలలో ఏకసభ్య కమిషన్ పర్యటన

ప్రజాశక్తి -పాడేరు : షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై నియమించిన విశ్రాంత ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ ఈనెల 17, 18 తేదీలలో విశాఖ జిల్లాలో పర్యటిస్తారని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సోమవారం వెల్లడించారు. జిల్లా అధికార యంత్రాంగం, వివిధ ఉపకులాల సభ్యులు సంఘాలతో సమావేశమై వినతిపత్రాలు స్వీకరిస్తారన్నారు. స్వీకరించిన వినతి పత్రాలు పరిశీలన చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తారని స్పష్టం చేశారు. షెడ్యూలు కులాలలో వివిధ ఉపవర్గాలు సామాజిక,ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా ఉన్న లోటుపాట్లను పరిశీలిస్తారన్నారు. తగిన ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 18వ తేదీన ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాలు సమర్పించాలని సూచించారు.



సభ్యత్వం అందజేస్తున్న సురేష్

చురుగ్గా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - చింతపల్లి : మండలంలోని కొమ్మంగి పంచాయతీలో చల్లంగి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఏర్పడిన తరువాత జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి, ఇందులో భాగంగా కొమ్మంగి పంచాయతీలోనే గాక మండలంలో అన్ని పంచాయతీలలో ఆ పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా సురేష్ తన నేతత్వంలో అనేక మందికి సభ్యత్వం నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందన్నారు

చెరువుల మరమ్మతులకు నిధులు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని చెరువుల మరమ్మత్తులు చేపడతామని ఎస్ఎంఐ అసిస్టెంట్ ఇంజనీర్ డి. లోకేష్ కుమార్ వెల్లడించారు. చెరువులు మరమ్మత్తులు చేపట్టాలని ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురించిన వార్తపై స్పందించారు. తాజంగి, సిరిపురం, చౌడుపల్లి చెరువులకు జిల్లా కలెక్టర్ ఉపాధి హామీ పథకంలో పనులు మంజూరు చేశారన్నారు. తాజంగి రిజర్వాయర్‌కు రు. 35 లక్షలు, సిరిపురం చెరువుకు రూ.15 లక్షలు, చౌడేపల్లి చెరువుకు రూ.20 లక్షలు విలువైన పనులను మంజూరు చేశారన్నారు. సిరిపురం చెరువులో పది రోజుల్లో పనులు చేపడతామన్నారు. తాజంగి రిజర్వాయర్, చౌడుపల్లి చెరువులో నీటిమట్టం తగ్గినప్పుడు పనులు చేపడతామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆ రెండిట్లో నీరు ఎక్కువగా ఉందని పేర్కొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలో వేములపూడి ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణారావు మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు విద్యుత్ పొదుపుపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈమేరకు విద్యార్థులకు ఇంధన పొదుపు అంశంపై పెయింటింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరం మేరకు మాత్రమే విద్యుత్‌ను వినియోగించాలని, రాయితీపై లభించే సోలార్ ప్యానెళ్లను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ఎల్ఇడి బల్బుల వినియోగం వల్ల విద్యుత్ ఆదా అవుతుందని, వాటి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లలో వీలైనంత వరకు విద్యుత్‌ను ఆదా చేసే స్టార్ రేటెడ్ ఉపకరణాలను ఉపయోగించాలన్నారు. సుస్థిర భవిష్యత్ కోసం ఇంధన పొదుపు అత్యావశ్యకమని.. భావితరాల భద్రత కోసం ఇంధనాన్ని పొదుపుగా ఉపయోగించాల్సిన అవసరముందని స్పష్టం చేశారు.

రోడ్లపై పేరుకుపోయిన చెత్త!

- అరకులోయలో క్షీణించిన పారిశుధ్యం
- దుర్వాసనతో జనం ఉక్కిరిబిక్కిరి.
- పట్టించుకోని పాలకులు,అధికారులు



ఎన్‌టిఆర్ గ్రౌండ్ బస్ స్టాప్ పక్కన రోడ్డుపైనే వేసిన చెత్తాచెదారం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:అరకులోయ మండలం కేంద్రంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది.ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.ఎన్టీఆర్ గ్రౌండ్ పక్కన బస్‌స్టాప్ ప్రాంతంలో డస్టు బిన్లు లేక చెత్త చెదారం రోడ్డుపై చెల్లాచెదురుగా పడి దుర్వాసన వెదజల్లుతోంది. నెల రోజులుగా చెత్తను తొలగించకపోవడంతో మరింత దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ ప్రాంతంలో ఉన్న హోటల్స్, లాడ్జిలు నిర్వాహకులు చెత్తాచెదరాలను పడేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతుంది.
ప్లాస్టిక్ రహిత అరకులోయగా దిద్దుతామని ఒకవైపు జిల్లా అధికారులు, పంచాయతీ పాలకులు చెబుతుంటే, మరోవైపు ప్లాస్టిక్ కవర్లు ఎందుకు నియంత్రించట్లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అరకులోయలో అధికంగా ప్లాస్టిక్ కవర్లు బాటిల్స్ వాడుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో ఎక్కడ చూసిన ప్లాస్టిక్ కవర్లే కనిపిస్తున్న పరిస్థితి ఉంది.పరిస్థితి తీవ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చినురాలితే రోడ్డు వెంబడి వేసి చెత్తాచెదారం తడిసి, ముగిపోయి, మరింత దుర్వాసన వెదజల్లుతుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు.ఈ రోడ్డుపై నిత్యం స్కూల్, కాలేజీ విద్యార్థులు, సరభగూడా, జడ్పీ కాలనీ, వెళ్ళ స్థానికులు ముక్కు మూసుకుని వెళ్లవలసిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తా సోదరులను తొలగించాలని, ప్రత్యేక డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





అరుకు, అనంతగిరిలో వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని విఆర్ఒ నాగేశ్వరరావు తెలిపారు.సోమవారం మండలంలోని లోతేరు పంచాయతీ తోడుబంధ గ్రామంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై రైతులు అర్జీలు పెట్టుకోవాలని సూచించారు. విఆర్ఒ పాంగి చిట్టిబాబు, రెవిన్యూ సిబ్బంది, స్థానిక నేత శ్రీరాములు పాల్గొన్నారు.
అనంతగిరి: మండలంలోని అనంతగిరి పంచాయతీ సచివాలయంలో సోమవారం రెవిన్యూ సదస్సు నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల గిరిజనులు వచ్చి వినతులు సమర్పించారు ముఖ్యంగా భూముల మ్యుటేషన్, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, పేర్లు మార్పులపై అర్జీలు వచ్చాయి. పెద్దూరు గ్రామానికి స్మశాన వాటిక స్థలం కేటాయించాలని స్థానికులు విన్నవించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సోమ్మెల. రూతు, జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, ఎంపిపి శెట్టి నీలవేణి, తహశీల్దార్ మాణిక్యం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లను పునర్నియమించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి.పోతురాజు

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: తొలగించిన పిహెచ్‌సిల హెల్త్ అసిస్టెంట్లను వెంటనే పునర్నియమించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 20 ఏళ్లుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్లను రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా తొలగించిందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 270 మంది హెల్త్ అసిస్టెంటును అకస్మాత్తుగా తొలగించడంతో వారు, వారి కుటుంబీకులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను తొలగించడం భావ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్పందించి తక్షణమే తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను విధుల్లో చేర్చుకోవాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో సంఘం నాయకులు టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎయును సందర్శించిన అమెరికన్ ఎంబసీ అధికారులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికన్ కాన్సులేట్ అధికారులు సోమవారం సందర్శించారు. హైదరాబాదులోని యుఎస్ కాన్సులేట్ కార్యాలయం అమెరికన్ కార్నర్స్ ప్రోగ్రామింగ్ కో-ఆర్డినేటర్ మెలిసా నందుల, అమెరికన్ కౌన్సులేట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కాలే నందుల ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్ ధనుంజయరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎయులో అమెరికన్ కార్నర్ సాధిస్తున్న ప్రగతి, నిర్వహించిన కార్యక్రమాలను వారికి వివరించారు. అమెరికన్ కార్నర్‌లో నిర్వహించే విభిన్న కార్యక్రమాలకు అవసరమైన సంపూర్ణ సహకారాన్ని తాము అందిస్తామని రిజిస్ట్రార్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయూ అమెరికన్ కార్నర్ సమన్వయకర్త ఆచార్య పాల్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీరు ఎయులోని అమెరికన్ కార్నర్‌ను సందర్శించారు. అక్కడి వసతులు, నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అమెరికన్ కార్నర్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను, ప్రగతిని ప్రశంసించారు.

ఎయును సందర్శించిన అమెరికా ప్రతినిధులు

ఆంధ్ర విద్యాలయాన్ని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా (డేవిస్) స్టెమ్ సెల్ బయాలజిస్ట్ ప్రొఫెసర్ చార్లెస్ సోమవారం సందర్శించారు. ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనంజయరావుతో మర్యాదపూర్వకంగా కార్యాలయంలో భేటీ అయ్యారు. రాష్ట్రంలో అతిపెద్ద వర్సిటీగా నిలుస్తున్న ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి పని చేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చార్లెస్‌ను ఎయుతో కలిసి పనిచేయాలని, తమ విద్యార్థులకు బోధన చేయాలని రిజిస్ట్రార్ ఆహ్వానించారు. ప్రొఫెసర్ చార్లెస్ సాధారంగా స్వీకరించారు.
ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఫుడ్ సైన్స్, ఫార్మసీ రంగాల్లో జరుగుతున్న పరిశోధనలు, నూతనంగా ఏర్పాటు అవుతున్న ప్రయోగశాలను చార్లెస్‌కు వివరించారు. ఎయులో నెలకొల్పిన ఆ-హాబ్ 120కు పైగా స్టార్టప్‌లకు కేంద్రంగా నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో అమెరికాకు చెందిన పారిశ్రామికవేత్తలు డాక్టర్ మైక్, ఎయు పూర్వ విద్యార్థి పారిశ్రామికవేత్త శ్రీవెంకట్, ఆచార్య బి.భరతలక్ష్మి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ విఆర్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చార్లెస్ తదితరులను ఎయు రిజిస్ట్రార్ సత్కరించి జ్ఞాపికలు బహుకరించారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-విశాఖపట్నం : దేశ రాజధానిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడానికి ఎయు జాతీయ సేవా పథకం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనంజయరావు సోమవారం అభినందించారు. జాతీయస్థాయిలో నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయని విసి అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చే విధంగా విద్యార్థులు తమ ప్రతిభతో రాణించాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పదిమంది విద్యార్థులు ఎంపిక కాగా ముగ్గురు ఎయు విద్యార్థులు కావడం గమనార్హం. ఇటీవల ఎయు నుంచి ఆరుగురు విద్యార్థులు ప్రీ రిపబ్లిక్ డే శిక్షణ శిబిరానికి హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురిని ఢిల్లీలో జనవరి 1 నుంచి 31 వరకు జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనడానికి ఎంపిక చేశారు. ఆనందపురం ఎక్యూ.జే పిజి కళాశాలకు చెందిన యు.గణేష్, సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల మల్కాపురం చెందిన పి.దివ్యశ్రీ, సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలకు చెందిన గుడ్ల కుశాంక ఎయు తరపున ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎయు జాతీయ సేవా పతకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్ పాల్గొన్నారు.

ఆచార్య సివి.నాయుడుకు అభినందనలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఫిజిక్స్ విభాగాధిపతి ఆచార్య సివి.నాయుడును ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనంజయరావు సోమవారం అభినందించారు. ఇటీవల ఇండియన్ మెటిరాలాజికల్ సొసైటీ నుంచి "ఫెలో ఆఫ్ ఇండియన్ మెటీరాలాజికల్ సొసైటీ" పురస్కారాన్ని ఆచార్య నాయుడు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆచార్య నాయుడును వైస్ ఛాన్సలర్ తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. బోధన, పరిశోధన రంగానికి అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ దీనిని అందజేశారు. గతంలో ఆచార్య నాయుడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డును స్వీకరించారు. ఆయన పర్యవేక్షణలో 29 మంది డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆచార్య నాయుడు 80కి పైగా జాతీయ, అంతర్జాతీయ పరిశోధన పత్రాలను ప్రచురించారు.



మాట్లాడుతున్న దొండా ప్రసాద్

దొనూరులో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని దొనూరు గ్రామంలో నెల రోజులుగా కలుషిత నీరు తాగుతున్నారని, తక్షణమే ఆ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని పీసా కమిటీ డివిజన్ కార్యదర్శి దొండా ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన దొనూరు గ్రామంలో మహిళలతో కలిసి సచివాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా దొనూరు గ్రామంలో మంచినీరు మురుగునీరుతో కలిసి కలుషితమైందని, దీనిపై పలుమార్లు సచివాలయం కార్యదర్శికి, సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కలుషిత మంచినీరు తాగడం వలన గ్రామస్తులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా వెంటనే మంచినీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దొనూరు మాజీ సర్పంచ్ గోమూరి రామారావు, వార్డు మెంబర్ కుర్ర రాము, మహిళలు డి.రమణమ్మ, శిరీషదేవి, గంగమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపుపై దాడి

ప్రజాశక్తి-సీలేరు : గూడెం కొత్తవీధి మండలం గాలికొండ పంచాయతీ సప్పర్ల గ్రామంలో బెల్ట్ షాపులపై సీలేరు ఎస్ఐ కె.రవీంద్ర తమ సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం బెల్ట్ షాపు నడుపుతున్న దండ రామకృష్ణను అదుపులోకి తీసుకొని, ఆయన వద్ద నుండి 32 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.రవీంద్ర స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సప్పర్ల గ్రామంలో మద్యం బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ఆ దాడి చేసినట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.
జికె.వీధి మండలంలో బెల్ట్ షాపుల దందా కొనసాగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గూడెంలో ఒక్కటే మద్యం షాపు నిర్వహించాల్సి ఉండగా, రింతాడ తదితర ప్రాంతాల్లోనూ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు బెల్ట్ షాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విశాఖ పోర్టు వేదికగా.. యథేచ్ఛగా రేషన్ బియ్యం తరలింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోర్టు వేదికగా రేషన్ బియ్యం అక్రమ తరలింపులో కూటమి నాయకుల హస్తం ఉందని వైసిపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆరోపించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కోర్టు సమీపంలోని నాదెండ్ల మనోహర్ విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో తనిఖీ చేసి పక్కనే ఉన్న రెండు వేర్‌హౌజ్‌లను ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించారు. అధికార పార్టీ ముఖ్యనేత బంధువుది కావడం వల్లే వాటిలో తనిఖీలు చేయలేదా ? అని నిలదీశారు. వెంటనే ఆ వేర్‌హౌజ్ వివరాలు వెల్లడించాలని ధర్మశ్రీ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఆరు నెలల్లో ప్రజలను ఉద్ధరించింది శూన్యమన్నారు. ప్రతి దానికీ గత ప్రభుత్వాన్ని నిందిస్తూ తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కొద్ది రోజుల క్రితం కాకినాడ పోర్టుకు తనిఖీకి వెళ్లిన మంత్రి నాదెండ్ల మనోహర్ టిడిపి ఎమ్మెల్యే వెంట ఉండగా షిప్‌ను తనిఖీ చేయకుండా ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు. బియ్యం అక్రమ రవాణా చేసే వారి తాట తీస్తామన్న ఆయన మాటలన్నీ తాటాకు చప్పుళ్లేనన్నారు. అన్నీ కాలయాపన కోసం చేస్తున్న డ్రామాలే అని తెలిపారు. బ్రోకర్ సంస్థలతో కుమ్మక్కై అది పిడిఎస్ బియ్యం అని తెలిసినా తనిఖీ చేయకుండా వెళ్లిపోయారన్నారు. దీన్ని బట్టి బియ్యం అక్రమ రవాణాకు ప్రభుత్వ పెద్దల సహకారం ఉన్నట్లు అర్థమవుతోందన్నారు.

ఆ స్థలంలో పరిశ్రమ వస్తేనే ఉపాధి

ఎల్‌జి పాలిమర్స్ కాంట్రాక్టు కార్మికుల గోడును ప్రభుత్వం వింటుందా ?
260 ఎకరాలు రియల్ ఎస్టేట్ పరం కాకుండా చర్యలు తీసుకుంటుందా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



ధర్నా చేస్తున్న ఉపాధి కోల్పోయిన కాంట్రాక్టు కార్మికులు

ఎప్పుడో వస్తాయో లేదో.. ఉపాధి చూపుతాయో లేదో తెలియని వాటికోసం సదస్సులు పెట్టి పారిశ్రామిక ఒప్పందాల పేర ఎప్పటికప్పుడు హడావుడి చేసే కంటే ఇదివరకే పారిశ్రామిక స్థలాల్లో ఉన్న వాటిని ప్రజలకు, కార్మికులకు ఉపాధి కల్పించేవాటిగా మార్చాలన్న డిమాండ్ ప్రజల నుంచి ప్రస్తుతం వినిపిస్తోంది. అలాంటి ప్రాంతాల్లో విశాఖ జిల్లా గోపాలపట్నం వద్దగల ఆర్.వెంకటాపురం గ్రామంలోగల ఎల్‌జి పాలిమర్స్ పరిశ్రమ స్థలం ప్రధానమైనది. అక్కడున్న పరిశ్రమలో గతంలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు చేసిన సుమారు 372 మందిలో కొంత మంది ఈ నేపథ్యంలోనే విశాఖ కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం తరలివచ్చారు. తాము గతంలో పనిచేసిన చోట ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సంబంధిత స్థలంలో పరిశ్రమనైనా పెట్టండి.. లేదంటే భూములు వెనక్కి ఇవ్వండన్న డిమాండ్ వారి నుంచి వినిపించింది. 2021 మే 7న ఎల్‌జి పాలిమర్స్‌లో ప్రమాదం జరిగిన నుంచీ ఇప్పటివరకూ వేల కుటుంబాలు ఉపాధి లేక రోడ్డున పడ్డాయంటూ ఈ కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.వందల కోట్ల విలువైన భూముల్లో పరిశ్రమ

1960వ దశకంలో సుమారు 260 ఎకరాల రైతుల సాగుభూములను పరిశ్రమ కోసం తీసుకున్నారు. ఎల్‌జి పాలిమర్స్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. పరిశ్రమ వస్తే ఉపాధి, ఉద్యోగాలు వచ్చి తమ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి జరుగుతుందని ఈ ప్రాంతానికి చెందిన పలు గ్రామాల ప్రజానీకం నాడు ఆశించారు. ఆశించినంతగా కాకపోయినా పరిశ్రమ వచ్చాక కొంత మార్పు గోపాలపట్నం ప్రాంతంలో జరిగింది. అయితే, ఎల్‌జి పాలిమర్స్ కంపెనీలో స్టైరీన్ గ్యాస్ లీకైన దుర్ఘటనలో 2020 మే 7న 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు మూడు రోజుల వ్యవధిలో మృత్యువాత పడ్డారు. రాష్ట్ర ప్రజలు ఈ ఘటనను నేటికీ మరచిపోలేదు. వేల సంఖ్యలో ఆ ప్రాంత జనం ప్రమాదకర విషవాయువును పీల్చి రోగగ్రస్తులుగా మారిన విషయం తెలిసిందే. అనంతర పరిణామాలతో అక్కడి పరిశ్రమ మూతపడింది. నాటి నుంచి ఆ ప్రాంత ప్రజలు, కార్మికులు ఉపాధి, ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు.
రూ.వందల కోట్ల విలువ పలికే తమ 260 ఎకరాల భూములపై రియల్ ఎస్టేట్‌దారుల కళ్లు పడడంతో వారిలో తాజాగా ఆందోళన ఎక్కువైంది. ఉపాధి లభిస్తుందని తమ తాతలు పరిశ్రమకు భూములిచ్చారని గుర్తుచేసుకుంటున్నారు. కాలుష్యం లేని పరిశ్రమను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వారి నుంచి వినిపిస్తోంది.

'ఉక్కు' కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం : విశాఖ ఉక్కు కర్మాగారం యాజమాన్యం తక్షణం కార్మికులకు వేతనాలు చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1404వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉక్కు కార్మికులపై ఆర్థిక ఆంక్షలు విధించడం దారుణమన్నారు. జీతాలు ఇవ్వకపోతే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. యాజమాన్యంలో జవాబుదారీతనం కొరవడిందని తెలిపారు. ఈ వైఖరిని నిరసిస్తూ, కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న ఉక్కు కార్మికుల కుటుంబాలతో ధర్నా నిర్వహించనున్నామన్నారు. దీక్షల్లో సంఘం నాయకులు డిసిహెచ్.వెంకటేశ్వరరావు, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, సూరిబాబు, పాపారావు, ఎర్రయ్య, కె.అప్పారావు, ఎంవి.రమణ, మధు, రాజేశ్వరరావు, సోమేష్, నాగేశ్వరరావు, కె.మహేష్, ఎంఆర్‌కె.ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా వైజాగ్ మీడియా క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమాజ సేవలో నిరంతరం బిజీగా గడుపుతూనే మరోవైపు జర్నలిస్టుల క్రీడలు నిర్వహించుకోవడం అభినందనీయమని జివిఎంసి స్పోర్ట్స్ ఆఫీసర్ ఇ.అప్పలరాజు అన్నారు. విశాఖ మీడియా క్రికెట్ టోర్నీ సోమవారం జివిఎంసి ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రతి ఏటా జర్నలిస్టులు క్రికెట్ పోటీలు నిర్వహించుకోవడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దేహదారుఢ్యం లభిస్తుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు మాట్లాడుతూ జర్నలిస్టుల క్రికెట్ టోర్నీ ఈ నెల 22 వరకు కొనసాగుతుందని తెలిపారు. టోర్నీ నిర్వాహకులు గాజుల గురు ప్రసాద్. కె.మదన్ తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు శంకుస్థాపనలో సర్పంచ్ రాజు, ఎంపిటిసి రామన్న

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పెంటలగెడ్డ గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి సోమవారం పంచాయతీ సర్పంచ్ నడిగట్ల రాజు, ఎంపీటీసీ మాడి రామన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిషత్తు నిధులు నుండి రూ.2 లక్షలు సిసి రోడ్డు నిర్మాణానికి మంజూరైనట్లు చెప్పారు. వంద మీటర్ల సిసి రోడ్డు నిర్మాణానికి ఈ నిధులు సరిపోకపోవడంతో పంచాయతీ నిధులు మ్యాచింగ్ చేస్తూ సిసి రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. పెంటలగెడ్డ గ్రామంలో రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారని, సిసి రోడ్డు పనులు పూర్తయితే వారికి సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు వీరమల్ల కృష్ణ, రౌతుల రాంబాబు, వైసిపి నాయకులు పిల్ల బుజ్జి, కూటమి నాయకులు పోతురాజు, కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి-సీలేరు : వాహనాలు నడిపేటప్పుడు జరిగే ప్రమాదాలు నివారణ చర్యలపై జీకే వీధి మండలం దారకొండలో డ్రైవర్లకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీలేరు ఎస్ఐ కే.రవీంద్ర మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు ప్రమాదాలకు దారి తీయకుండా డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని, లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్య నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లడం వల్ల ప్రమాదాలకు దారి తీస్తాయని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-రంపచోడవరం : ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. సంఘం అధ్యక్షులుగా కత్తుల ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొరగా పొట్టిదొర, కోశాధికారిగా గంటిమళ్ల సత్యనారాయణ, కుంజం అగ్గిదొర, కార్యనిర్వాహక కార్యదర్శిగా మిర్తివాడ చినస్వామిరెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికలను సమర్త కృష్ణ, బొగ్గుల కాటం రెడ్డి, కంగల పోతురాజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సభ్యులకు సీనియర్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గంటిమల్ల సత్యనారాయణ భోజన సదుపాయం కల్పించారు. అనంతరం నూతన కార్యవర్గంచే సమర్త కృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు.

జాకీర్ హుస్సేన్ మరణం బాధాకరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారతీయ శాస్త్రీయ కళలను ప్రపంచానికి పరిచయం చేసిన ప్రముఖ సంగీత విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ మరణం బాధాకరమని విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు సోమవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు దశాబ్దాలుగా సంగీత విద్వాంసుడిగా ప్రపంచ ఖ్యాతిని సొంతం చేసుకున్న మహోన్నత వ్యక్తి జాకీర్ హుస్సేన్ అని కొనియాడారు.

చేనేత, కాటన్ అండ్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెదవాల్తేరు పోలమాంబ ఆలయం పక్కన ఉన్న ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన శ్రీ సాయి చేనేత కాటన్ అండ్ సిల్క్ ఎక్స్ పోను సోమవారం సాయంత్రం విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎం.ప్రణవ్ గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.